జగనన్న పాలనలో సంతోషంగా పేదలు

- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్
- వైఎస్సార్ పార్కులో ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ రుహుల్లా, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు శ్రీశైలజ, దుర్గ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పేదలు, బడుగు బలహీన వర్గాలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. విజయవాడ పోలీసు కంట్రోల్ రూం వద్ద గల వైఎస్సార్ పార్కులో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి కేక్ కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్నారని చెప్పారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా లేకపోతే కూటమి పాలనలో రాష్ట్రం ఏవిధంగా తయారైందో అంతా చూస్తున్నారన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా లేకపోతే ఏ ఒక్క సంక్షేమ పథకం లేదని పేద ప్రజలంతా బాధపడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ అని అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్‌చార్జీల భారం మోపిందని దుయ్యబట్టారు. ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల భారం వేయబోతుందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణలోనూ, ధర విషయంలో అనేక రకాలుగా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పేద కుటుంబం వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఎప్పుడు వస్తారా? అని ఎదురుచూస్తోందన్నారు. పేదల ముఖాల్లో చిరునవ్వుకు కారణమైన వైఎస్ జగన్ పాలన రాష్ట్రంలో తిరిగి వస్తుందన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్ జగన్ ఐదేళ్ల పాటు ప్రజలకు అండగా ఉండి పాలన సాగించారన్నారు. వైఎస్ జగన్‌ను రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ తమ పెద్ద కొడుకుగా భావించారన్నారు. కూటమి ప్రభుత్వ ఆర్నెల్ల పాలన చూశాకా.. ఈ ప్రభుత్వాన్ని ఎందుకు ఎన్నుకున్నామా? అని బాధపడుతున్నారన్నారు. సంపద సృష్టి అంటే పేద ప్రజల రక్తం పీల్చడమే అన్నట్లు కూటమి ప్రభుత్వ తీరు ఉందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో సంస్కరణలు తెచ్చారన్నారు. పేదలను ఏ విధంగా ఆదుకోవచ్చో చేసి చూపించారన్నారు. ఈ ఆర్నెల్ల కూటమి పాలనలో విధ్వంసకర పాలన సాగుతోందన్నారు. డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ మాట్లాడుతూ జగన్ పేరుతో చెబితే సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, పీఏసీ సభ్యులు షేక్ ఆసిఫ్, పార్టీ నాయకులు పులిపాటి దుర్గారెడ్డి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

బావాజీపేటలో జగనన్న జన్మదినోత్సవ వేడుకలు...

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 27వ డివిజన్ కార్పొరేటర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో శనివారం బావాజీపేటలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్ మల్లీశ్వరి కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి వారికి అండగా నిలిచిన జగనన్నను ప్రతి ఒక్కరు మనస్సులో పెట్టుకున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల పంపిణీలో ఎక్కడ రాజీ పడకుండా అర్హత ఉంటే చాలు కులం, మతం , రాజకీయం చూడకుండా ప్రతి ఒక్కరి గడపకు సంక్షేమం అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లా గోవింద్. కోలా నాగరాజు, మల్లు దుర్గ రెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గిరిపురంలో...

లబ్బీపేట(విజయవాడతూర్పు): జననేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గిరిపురంలో ఘనంగా నిర్వహించారు. 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నేతలు కుక్కల రమేష్, కొమ్ము చంటి తదితరులు పాల్గొన్నారు.

అనాథలు, వృద్ధులు, వికలాంగుల మధ్య...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్.. అనాథలు, వృద్ధులు, వికలాంగుల మధ్య నిర్వహించారు. శనివారం బందరు రోడ్డులోని నిర్మల్ హృదయ్ భవన్‌లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనాథ బాలలతో కేక్ కట్ చేయించారు. వారితో అప్యాయంగా మాట్లాడుతూ కేక్ తినిపించారు. చిన్నారులు బర్త్‌డే సాంగ్ పాడి వైఎస్ జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అనాథలు, బాలలంటే ఎంతో ఇష్టమన్నారు. ప్రత్యేకంగా నిర్మల్ హృదయ్ భవన్‌కు వచ్చి అనాథలతో గడిపిన సందర్భాన్ని గుర్తు చేశారు. నిర్మల్ హృదయ్ సిస్టర్స్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్మల్ హృదయ్ భవనంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పుష్పాల కుమారి, దొడ్డా అంజిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను చూసి కూటమి సర్కారు భయపడుతోంది

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసి కూటమి సర్కారు భయపడుతోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ''హ్యాపీ బర్త్ డే జగనన్న'' అంటూ అభిమానులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలతో రాష్ట్ర వ్యాప్తంగా ఒక పండుగ వాతావరణం వచ్చిందన్నారు.

● తోపుడు బండ్లు పంపిణీ

అనంతరం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మల్లాది వేంకట సుబ్బారావు – బాలత్రిపుర సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 మంది పేదలకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని.. ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో తోటి వారికి సాయపడాలని విష్ణు సూచించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఆర్థిక సంక్షోభం పేరుతో నిర్వర్తించాల్సిన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చంద్రబాబుకు ఎన్నికలకు ముందు తెలియదా..? అని సూటిగా ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు శర్వాణీ మూర్తి, ఎండి షాహినా సుల్తానా, అలంపూర్ విజయలక్ష్మి, యరగొర్ల తిరుపతమ్మ, కొండాయిగుంట మల్లీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు.

●ఎమ్మెల్సీ కార్యాలయంలో...:

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కార్యాలయం వద్ద ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానాలు పాల్గొని కేకు కట్ చేసి.. నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, నేరెళ్ల శివ ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.


సింగ్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనాసుల్తానా, నాయకులు


తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు, నాయకులు

కోట్లాది మంది గుండె చప్పుడు వైఎస్ జగన్


రాజీవ్‌నగర్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): కోట్లాది మంది అభిమానుల గుండె చప్పుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. రాజీవ్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో అవ్వాతాతలకు అన్నదానం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని విష్ణు తెలిపారు. సుదీర్ఘ పాదయాత్రలో పేదల కష్టాలు చూసి ఆయన ప్రకటించిన నవరత్నాలు నవశకానికి నాంది పలికాయన్నారు. గడప గడపకు సంక్షేమాన్ని అందించి ప్రతి ఇంట్లోనూ కుటుంబసభ్యుడిగా ప్రజలందరి ప్రేమాభిమానాన్ని సొంతం చేసుకున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అని చెప్పారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, నాయకులు మాన్యం జగదీష్,బివి రెడ్డి, ఇస్మాయిల్, మేడా రమేష్, రమణారెడ్డి, ఉప్పులేటి రాజు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్లోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అలంపూర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.


బావాజీపేటలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి


విజయవాడ కంట్రోల్ రూమ్ వద్ద మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


జగనన్న జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, పార్టీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత తదితరులు


ఆంధ్రప్రభకాలనీలో కేకు కట్‌చేస్తున్న విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు, నాయకులు

క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ రాష్ట్ర జట్టులో చోటు



విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 నెట్ బాల్ రాష్ట్ర బాలుర జట్టుకు తమ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు పీబీ సిద్ధార్థ జూనియర్ కాలేజీ వ్యాయామ విద్యా అధ్యాపకులు కె.మార్కండేయులు తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థి చింతా దీపక్ ఇటీవల జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలకు హాజరై అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించాడని తెలిపారు. చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న దీపక్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటేశ్వర్లు శనివారం అభినందించారు.

23వ డివిజన్‌లో జాయింట్ ఇన్‌స్పెక్షన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ప్రారంభించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ కార్యక్రమం 23వ డివిజన్ పరిధిలోని 93, 97 సచివాలయాల పరిధిలో శనివారం జరిగింది. ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాల స్వామి, సచివాలయ సిబ్బంది, ఏఈలు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. చలసాని వెంకట కృష్ణయ్య వీధిలో అండర్ గ్రౌండ్ డ్రైయిన్, పార్కింగ్ సమస్య , కోవెలముడివారి వీధి చివరి కల్వర్టు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. పొగాకు బేరన్ వీధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య, వీధిలో స్ట్రీట్ లైట్ సమస్య అధికారుల దృష్టికి రాగా పరిష్కరిస్తామన్నారు. అధికారులు మతీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలాజీ శ్రీనివాస మూర్తి, ఏఈ భవానీ గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ నెట్‌బాల్ విజేత ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ



నూజివీడు: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్‌బాల్ మహిళల టోర్నమెంట్ విజేతగా విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల జట్టు నిలిచింది. పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలేజీలో శనివారం అంతర్ కళాశాలల నెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ జె. నవీన లావణ్యలత ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఐదు టీంల మధ్య పోటీలు జరిగాయి. ద్వితీయ స్థానంలో దుర్గామల్లేశ్వర సిద్ధార్థ డిగ్రీ కళాశాల, తృతీయ స్థానంలో ఆంధ్ర లయోలా కళాశాల, నాలుగో స్థానంలో లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లు నిలిచాయి. విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు డి. సత్యనారాయణ, డి. నవీన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి షషాంక్ పాల్గొన్నారు.

కనులపండువగా షిరిడీసాయి మందిర వార్షికోత్సవం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని షిరిడీసాయి మందిరం 16వ వార్షికోత్సవం శనివారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సర్వదేవతా హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రభ కాలనీలోని శ్రీ షిరిడీ సాయి మందిరానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలతో ఈ ప్రాంతానికి మరింత ఆధ్యాత్మిక శోభ వచ్చిందన్నారు. బాబా దివ్య ఆశీస్సులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపైన, నియోజకవర్గ ప్రజలపైన ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సాయి ప్రభ సేవా ట్రస్ట్ అధ్యక్షురాలు గరికపాటి బాలత్రిపుర సుందరి, నిర్వాహకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

సైంటిస్ట్ చందు సాంబశివరావు


సైన్స్ ఎక్స్‌పోలో ప్రాజెక్టులను చూస్తున్న సైంటిస్ట్ చందు సాంబశివరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతదేశం అతిపెద్ద టెక్నాలజీ పవర్ హౌస్ గా మారే మార్గంలో ఉందని, నేటి విద్యార్థులు ఇందులో ముఖ్యమైన పాత్ర పోషించాలని సైంటిస్ట్ చందు సాంబశివరావు అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏలూరు రోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను ఆయన సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలు విద్యార్థులను నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం టెక్నాలజీలో వస్తున్న మార్పులు , దాని ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు ఎక్స్ పో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో 477 మోడల్స్ ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో విద్యార్థులు సందర్శించారు. వివిధ అంశాలపై ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఇస్రో, నాసా వంటి సంస్థల్లో శాస్త్రవేత్తల బృందంలో పనిచేసిన చందు సాంబశివరావును స్కూల్ యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో మూడి కొండయ్య, సాలిముట్టి మార్క్, స్కూల్ డైరెక్టర్లు వై పార్థసారధి, కె. రాజేంద్ర, ఎం. లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ప్రవీణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బిషప్ సుధాకర్, పాస్టర్ దానియల్ తదితరులు


బాలయేసు జన్మదిన వృత్తాంతాన్ని తెలుపుతూ నాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. ముందుగా పాఠశాల విద్యార్థులు, చిన్నారులు ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలుపుతూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఆలపించిన గీతాలు.. వేసిన నృత్యాలు అందరిచేతా చప్పట్లు కొట్టించాయి. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసిన విద్యార్థులకు.. ఉత్తమ ఉపాధ్యాయులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ ప్రిన్సిపల్ ఆశాజార్జ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ):రామకృష్ణాపురం రఘునాథరావు వీధిలోని ఫుల్‌గాస్పల్ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చి పాస్టర్ దానియల్ భక్తులను క్రీస్తు సందేశాన్ని వినిపించారు. శాంతి, సహనం, ప్రేమ తత్వంతో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ప్రజలు చేసిన పాపాలను తొలగించేందుకే ఏసు క్రీస్తు భూమిపైకి వచ్చారన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో నడిచినప్పుడే ప్రపంచంలో శాంతి నెలకుంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరితో స్నేహ భావంతో మెలగాలని ఉపదేశించారు. అనంతరం కేక్‌కట్ చేసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో బిషప్ కె.సుధాకర్, సంఘ పెద్దలు ఇమ్మానియల్ రాజు, సలొమి, శేఖర్, సంఘస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గణితంలో అద్భుతాలు ఆవిష్కరణ


గురుకుల కళాశాలలో రామానుజన్ జయంతిలో పాల్గొని మాట్లాడుతున్న అధ్యాపకులు డాక్టర్ సుధాకర్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామనుజన్ 137వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గణితశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సుధాకర్ రామానుజన్–గణిత జీవితం అనే అంశం గురించి విద్యార్థులకు వివరించారు. గణితశాస్త్రంలో ప్రపంచ ప్రసిద్ధులైన రామానుజన్ భారతీయుడు కావడం మనకు గర్వకారణమని కొనియాడారు. నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన ఆయన గణితమే తన లోకంగా జీవించారని తెలిపారు. చిన్న వయసులోనే గణితంలో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వల్లూరు నీరజ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు పి.ఎన్.వి ప్రసాదరావు, సుధారాణి, సుమిత్ర, విద్యార్థినులు పాల్గొన్నారు. దుర్గాపురంలోని ఎస్‌టీవీఆర్ పాఠశాలలో గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.సూర్యప్రభ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు


వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర


వైద్య శిబిరం వద్ద సిబ్బంది నుంచి వివరాలు తీసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): భవానీ దీక్ష విరమణలకోసం వచ్చే భక్తులకు ఎటువంటి లోపం లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా వినాయకుడి గుడి, సీతమ్మ పాదాలు, దుర్గా ఘాట్, కృష్ణవేణి ఘాట్, ప్రాంతాలలో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే భవాని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా 35 ప్రదేశాలలో తాగునీటి పాయింట్లు, 8 ప్రాంతాలలో తాత్కాలిక మరుగుదొడ్లు, 6 ప్రదేశాలలో క్లోక్ రూమ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా 1400 పారిశుద్ధ్య కార్మికులను 38 ప్రదేశాలలో కేటాయించి 24 గంటలు విధుల్లో ఉండేలా చూస్తున్నామన్నారు. భవానీలు ఘాట్లలో వదిలే వస్త్రాలను కన్వేయర్ బెల్ట్ ద్వారా ఎప్పటికప్పుడు తీసేయాలని, దాన్ని అధికారులు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సుపరింటెండింగ్ ఇంజినీర్ వర్క్స్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

• జగన్మాతా.. కరుణించమ్మా...


ప్రసాదం స్వీకరిస్తున్న భవానీలు


మహా రాజగోపురం వద్ద అమ్మవారి ప్రతిమ


దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భవానీలు


ఇరుముడితో కొండకు తరలివస్తున్న భవానీలు

జగన్మాతా.. కరుణించమ్మా...లోకమాతా... కాపాడమ్మా అంటూ భవానీలు అమ్మవారిని స్మరించుకుంటూ ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భవానీలు దీక్షలు విరమించేందుకు శనివారం కొండకు తలివచ్చారు. జై భవానీ... జై జై... భవానీ అంటూ భవానీలు దుర్గమ్మను దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హుస్సేన్, ఉపాధ్యాయులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పాయకాపురం ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో జాతీయ గణిత దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శ్రీనివాసన్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్ర పితామహులుగా చెప్పుకునే శ్రీనివాసరామానుజన్ జయంతిని గుర్తుచేసుకుంటూ జాతీయ గణిత దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా జరుపుకుంటామని చెప్పారు. పాఠశాల గణిత ఉపాధ్యాయులు గణేష్, శ్రీనివాసు నరసింహమూర్తి, సత్యవతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరం నృత్య రూపకం


కళాకారులు ప్రదర్శిస్తున్న నృత్య రూపకం

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం (సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలో కళాపీఠం వేదికమీద శనివారం హైదరాబాద్‌కు చెందిన అభినయ వాణి నృత్య నికేతన్ వ్యవస్థాపకురాలు అంతర్జాతీయ నృత్య కళాకారిణి చావలి బాలా త్రిపుర సుందరి బృందం ప్రదర్శించిన క్షీరసాగర మథనం నృత్య రూపకం ఆద్యంత్యం కూచిపూడి నృత్య వైభవాన్ని చాటింది. దుర్వాస మహాముని శాప కారణంగా దేవతలు ఇక్కట్లు పాలవుతారు. దేవదానవ యుద్ధంలో దేవతలు ఓడిపోతారు. మహావిష్ణువు సూచనతో దేవతలు, రాక్షసులు సాగర మథనం చేస్తారు. దాని ద్వారా వచ్చిన అమృతాన్ని దేవ దానవులు సమానంగా తీసుకోవాలని భావిస్తారు. అమృతం దానవులకు అందితే దేవతలు ఇబ్బంది పడతారని శ్రీ మహావిష్ణువు మోహిని రూపంలో అమృతాన్ని దేవతలకు పంచడంతో వారు మృత్యుంజయులవుతారు. రచన దేవులపల్లి కృష్ణశాస్త్రి, సంగీతం డాక్టర్ బాలాంత్రపు రజనీకాంతరావు, నట్టువాగం చావలి బాలా త్రిపుర సుందరి, గాత్రం డీఎస్‌బీ శాస్త్రి, దర్భా మృదురవళి, నృత్య దర్శకత్వం డాక్టర్ వెంపటి చిన సత్యం. కార్యక్రమంలో కళాపీఠం కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, బాధ్యులు ఎన్.లలిత్ ప్రసాద్ కళాకారులను సత్కరించారు.